TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్
వందే భారత్
Voice of Vande Bharath
తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 96 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ గురువారం | నవంబర్ 05, 2026

ఘనంగా శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం

- హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్ యాదవ్
- ఎన్టీఆర్ స్టేడియంలో వైభవంగా యాదవుల సంస్కృతి, సంప్రదాయ ఉత్సవాలు



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : నగరంలోని ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణంలో శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం–2026 వేడుకలు కన్నులపండువగా, కోలాహలంగా సాగాయి. ఈ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డితో పాటు జూబ్లీహిల్స్ నియోజకవర్గ శాసనసభ్యుడు వి.నవీన్ యాదవ్ పాల్గొని సందడి చేశారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... యాదవ సోదర సోదరీమణులందరికీ సదర్ ఉత్సవ శుభాకాంక్షలు తెలిపారు. యాదవుల విశిష్ట సంస్కృతి, సంప్రదాయాలు, వీరత్వం మరియు ఐక్యతకు సదర్ ఉత్సవాలు ప్రతిరూపమని కొనియాడారు. శ్రీకృష్ణ సదర్ సమ్మేళన్ ఉత్సవ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు కీలక నాయకులు భాగస్వాములయ్యారు. బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, మల్లు రవి, ఉత్తరప్రదేశ్ ఎంపీ ధర్మేంద్ర యాదవ్, పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన యాదవ సంఘాల ప్రతినిధులు, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొని సదర్ సంబరాలను విజయవంతం చేశారు.

ఢిల్లీ నాయకత్వం ముందు
తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రేవంత్ రెడ్డి ఈఎంఐ ముఖ్యమంత్రి..
- పాలన వదిలి ఢిల్లీ పర్యటనలే ఎక్కువ
- కాంగ్రెస్ సంచులు మోస్తే.. బీజేపీ చెప్పులు మోస్తోంది
- మియాపూర్‌లో 550 ఎకరాల భూముల విక్రయం వెనుక కమీషన్ల దందా



2లో..

కేపీహెచ్‌బీలో 'మెగా ముకుంద జ్యువెలరీ'
14వ షోరూమ్ ఘన ప్రారంభం



4లో..

- ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు
- తరుగు కేవలం 6.99%, ఎటువంటి తయారీ ఛార్జీలు లేవు: డైరెక్టర్లు
- ఈ నెల 4 నుంచి 15 వరకు ప్రత్యేక ప్రారంభోత్సవ ఆఫర్లు

హిందూ కాలేజీ ప్రైవేటీకరణను సహించేది లేదు

- కేంద్రాన్ని హెచ్చరించిన టీఆర్ఎస్ చీఫ్ కవిత
- ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ప్రొఫెసర్లకు నేరుగా కలిసొచ్చి సంఘీభావం
- 130 ఏళ్ల చారిత్రక వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది
- కేంద్రం దిగిరాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిక



2లో..

అల్వాల్ రైతుబజార్‌ను తొలగిస్తే 1,500
కుటుంబాల జీవనోపాధి దెబ్బతింటుంది

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం
- ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో తొలగింపు భయాలు..
- ప్రత్యామ్నాయ స్థలం చూపాలని విజ్ఞప్తి
- 26 ఏళ్లుగా వేలాది మంది రైతులకు, వినియోగదారులకు సేవలందిస్తున్న రైతుబజార్


3లో..

కండక్టర్ ప్రవళిక మృతిపై సీఎం రేవంత్ రెడ్డి సంతాపం

- కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ముఖ్యమంత్రి
- బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : టీజీఎస్ ఆర్టీసీ మణుగూరు డిపోకు చెందిన మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక అకాల మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. ఆమె ఆకస్మిక మరణం బాధాకరమని పేర్కొంటూ, ప్రవళిక కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని మరియు సంతాపాన్ని తెలియజేశారు. ఈ కష్టసమయంలో ప్రవళిక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. బాధితులకు ప్రభుత్వ పరంగా అందించాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తామని ఆయన పేర్కొన్నారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
గురువారం, నవంబర్ 05, 2026

ఎల్లమ్మ సిద్ధోగం వేడుకలకు కేటీఆర్‌కు ఆహ్వానం

- సంప్రదాయబద్ధంగా గడ, అమ్మవారి ప్రతిమతో ఆహ్వానించిన ఎల్లారెడ్డిపేట గౌడ సంఘం
- రాజన్న సిరిసిల్ల జిల్లా గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు



సిరిసిల్ల / ఎల్లారెడ్డిపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ : రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన గౌడ సంఘం ప్రతినిధులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామారావును మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ఆరాధ్య దైవమైన ఎల్లమ్మ తల్లి సిద్ధోగం వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట గౌడ సంఘం సభ్యులు అమ్మవారి ప్రతిమతో పాటు గౌడ కులస్తుల సంప్రదాయానికి ప్రతీక అయిన 'గడ'ను తీసుకొచ్చి కేటీఆర్‌కు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి ఆహ్వానించారు. అమ్మవారి సిద్ధోగం మహోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొనాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టెస్కాబ్ మాజీ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, సర్పంచ్ సర్సింహులు, ఎంపీటీసీ పరశురాములు గౌడ్ తదితర స్థానిక ప్రజాప్రతినిధులు, గౌడ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఢిల్లీ నాయకత్వం ముందు
తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్నారు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రేవంత్ రెడ్డి ఈఎంఐ ముఖ్యమంత్రి..
- పాలన వదిలి ఢిల్లీ పర్యటనలే ఎక్కువ
- కాంగ్రెస్ సంచులు మోస్తే.. బీజేపీ చెప్పులు మోస్తోంది
- మియాపూర్‌లో 550 ఎకరాల భూముల విక్రయం వెనుక కమీషన్ల దందా

హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, రాష్ట్ర హక్కులను ఢిల్లీ పార్టీల నాయకత్వాల ముందు తాకట్టు పెడుతున్న కాంగ్రెస్, బీజేపీల తీరు దొందూ దొందేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం తెలంగాణ భవన్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అవుకు దామోదర్ రెడ్డికి పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రియాంక గాంధీ సెక్యూరిటీ నెట్టివేసే పరిస్థితి రావడం కాంగ్రెస్‌లో తెలంగాణ ముఖ్యమంత్రికి ఇస్తున్న గౌరవానికి నిదర్శనమని కేటీఆర్ ఎద్దేవా చేశారు. అమిత్ షా ముందు బండి సంజయ్, తనకంటే వయసులో చిన్నవాడైన అమిత్ షా కాళ్లకు రాంచందర్ రావు నమస్కరించాల్సిన పరిస్థితి రావడం రాష్ట్ర ఆత్మగౌరవాన్ని దిగజార్చడమేనన్నారు. అమిత్ షా ఉత్త చేతులతో వచ్చి వెళ్లారే తప్ప రాష్ట్రానికి ఒక్క మెట్రో లేదా జాతీయ ప్రాజెక్టునైనా తెచ్చారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఢిల్లీకి సంచులు మోసే పార్టీ అయితే, బీజేపీ చెప్పులు మోసే పార్టీగా మారిందని వ్యాఖ్యానించారు.



రేవంత్ రెడ్డి 'ఈఎంఐ ముఖ్యమంత్రి'

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర పరిపాలనను వదిలేసి వారానికి రెండుసార్లు ఢిల్లీ పర్యటనలకే పరిమితమవుతూ ఓ 'ఈఎంఐ ముఖ్యమంత్రి'లా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్‌ను చూసి ప్రజలు బీఆర్ఎస్‌ను గెలిపించారే తప్ప రేవంత్‌ను చూసి కాంగ్రెస్‌కు ఓటు వేయలేదన్నారు. భూ దందాలు, కమీషన్ల కోసమే కొందరు నాయకులు రేవంత్ రెడ్డి పంచన చేరుతున్నారని ఆరోపించారు.

సాగునీరు, విద్యుత్ వ్యవస్థల ధ్వంసం

కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై కక్ష, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై పగబట్టి నీటిని ఎత్తిపోయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో నిరంతరం నీరు, విద్యుత్ అందితే.. నేడు మళ్లీ హైదరాబాద్‌లో తాగునీటి ఎద్దడి, విద్యుత్ కోతలు మొదలై ఇన్వర్టర్లు, జనరేటర్లకు డిమాండ్ పెరిగిందన్నారు. ఎన్నికల ముందు అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేశారని ధ్వజమెత్తారు.

పేదల ఇళ్లు కూల్చడమే వచ్చు.. కట్టడం రాదు

మియాపూర్‌లోని 550 ఎకరాల భూములను తీర్పు వచ్చిన 24 గంటల్లోనే అమ్మేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించడం వెనుక వేల కోట్ల రూపాయల కమీషన్ల దందా ఉందని కేటీఆర్ ఆరోపించారు. ఆ భూములను తెలంగాణ ఉద్యమకారులకు, అమరవీరుల కుటుంబాలకు, పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో లక్ష డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తే, రేవంత్ ప్రభుత్వం ఒక్క ఇల్లైనా కట్టిందా అని ప్రశ్నించారు. నిర్మించడం చేతకాకపోయినా, పేదల ఇళ్లను కూల్చడంలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు.

హిందూ కాలేజీ ప్రైవేటీకరణను సహించేది లేదు

- కేంద్రాన్ని హెచ్చరించిన తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత
- ఢిల్లీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ప్రొఫెసర్లకు నేరుగా కలిసొచ్చి సంఘీభావం
- 130 ఏళ్ల చారిత్రక వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది
- కేంద్రం దిగిరాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిక

ఢిల్లీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని ప్రతిష్టాత్మక హిందూ కాలేజీని ప్రైవేట్ పరం చేయడానికి ప్రయత్నిస్తే ఊరుకునేది లేదని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించారు. కళాశాల ప్రత్యేక గుర్తింపును, చారిత్రక వారసత్వాన్ని కాపాడుకోవడానికి గత నెలన్నర రోజులుగా విద్యార్థులు, ప్రొఫెసర్లు నిర్వహిస్తున్న ఆందోళనకు ఆమె పూర్తి మద్దతు ప్రకటించారు. బుధవారం రోజున హిందూ కాలేజీకి చేరుకున్న కవిత, అక్కడ ధర్నా చేస్తున్న విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి సంఘీభావం తెలిపారు. ఈ న్యాయమైన పోరాటంలో వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ... దాదాపు 130 ఏళ్లుగా ఎంతోమంది మేధావులను, దేశానికి మహోన్నత వ్యక్తులను అందించిన చరిత్ర హిందూ కాలేజీకి ఉందన్నారు. ప్రైవేట్ సంస్థలు కాలేజీ నిర్వహణకు నిధులు ఇచ్చాయనే నెపంతో, ఆ కళాశాల యాజమాన్య హక్కులను వారి కే కట్టబెట్టాలని చూడటం ఏమాత్రం సరికాదని మండిపడ్డారు. యూజీసీ నిబంధనల ప్రకారం డొనేషన్లు ఇచ్చే ప్రైవేట్ సంస్థలకు పరిమితమైన సౌకర్యాలు మాత్రమే కల్పించాలని, అంతేకానీ నిధుల వంకతో కాలేజీని పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని స్పష్టం చేశారు. నెలన్నర రోజులుగా విద్యార్థులు, అధ్యాపకులు, కాలేజీ సిబ్బంది నిరసన తెలుపుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడంపై కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలేజీ అడ్మిషన్లలో జరుగుతున్న అక్రమాలు, ప్రైవేటీకరణ ప్రయత్నాలపై విద్యార్థులు లేవనెత్తుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. విద్యార్థుల గొంతు నొక్కాలని చూస్తే ఈ ఆందోళనలు మరిన్ని రూపాంతరాలు దాల్చి దేశవ్యాప్త ఉద్యమంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కేంద్రం స్పందించి ప్రైవేటీకరణ ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.



విద్యార్థుల ప్రయాణానికి ఆర్టీసీ భరోసా

- హంటర్ రోడ్డులో నూతన బస్ స్టాప్ ప్రారంభం
- మెరుగైన రవాణా సౌకర్యమే ఆర్టీసీ లక్ష్యం
- డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ నాయక్
- తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞాన పీఠం వద్ద అందుబాటులోకి బస్ స్టాప్
- పీఠాధిపతి ఆచార్య గడ్డం వెంకన్నతో కలిసి ప్రారంభించిన డీఎం

హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : విద్యార్థులు మరియు ప్రజలకు సౌకర్యవంతమైన, మెరుగైన ప్రజా రవాణా సేవలను అందించడమే టీజీ ఆర్టీసీ ప్రధాన లక్ష్యమని హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ నాయక్ తెలిపారు. విద్యార్థులు నిత్యం ఎదుర్కొంటున్న ప్రయాణ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వరంగల్ హంటర్ రోడ్డులోని బొందివాగు సమీపంలో ఉన్న సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞాన పీఠం ప్రధాన రహదారి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన బస్ స్టాప్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. విశ్వవిద్యాలయం పీఠాధిపతి ఆచార్య గడ్డం వెంకన్నతో కలిసి రిబ్బన్ కట్ చేసి ఈ బస్ స్టాప్‌ను విద్యార్థులకు, ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ధరంసింగ్ నాయక్ మాట్లాడుతూ... నిత్యం విశ్వవిద్యాలయానికి వచ్చే విద్యార్థులకు, స్థానిక కాలనీ వాసులకు రవాణా పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈ బస్ స్టాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రతిరోజూ ప్రయాణించే విద్యార్థులు బస్సులు ఎక్కడానికి, దిగడానికి ఈ పాయింట్ అనువుగా ఉంటుందని చెప్పారు. ప్రజారవాణా వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రయాణికులకు గుణాత్మక సేవలు అందించేందుకు ఆర్టీసీ నిరంతరం కృషి చేస్తోందని, నూతన బస్ స్టాప్‌ను విద్యార్థులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. విశ్వవిద్యాలయం వద్ద ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న బస్ స్టాప్‌ను ఏర్పాటు చేసినందుకు గాను డీఎం ధరంసింగ్ నాయక్‌ను పీఠాధిపతి ఆచార్య గడ్డం వెంకన్న పూలబోకే అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కంట్రోలర్ చంద్రయ్య, పీఠం జూనియర్ అసిస్టెంట్ అమేర్ ఆలీఖాన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీమంతుల దామోదర్, డాక్టర్ బాసని సురేష్, టెక్నికల్ అసిస్టెంట్ డాక్టర్ గంపా సతీష్, బుక్ బేరర్ సిద్దోజు సునంద, సిబ్బంది ఆంజనేయులు, అశోక్, సులోచనలతో పాటు పరిశోధక విద్యార్థులు, స్థానిక కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
గురువారం, నవంబర్ 05, 2026

నిరుపేద కౌలు రైతు కుటుంబానికి చేయూత

- 'వివేకానంద సేవా సంస్థ' ఆర్థిక సాయం
- రూ. 22 వేల నగదు, 50 కిలోల బియ్యం అందజేసిన బాధ్యులు



వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : ఇటీవల అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో మృతి చెందిన గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్ల గ్రామానికి చెందిన కౌలు రైతు ఇప్ప శంకర్ కుటుంబాన్ని 'వివేకానంద సేవా సంస్థ' మానవతా దృక్పథంతో ఆదుకుంది. మృతునికి ముగ్గురు చిన్న పిల్లలు ఉండగా.. కనీసం నివాసముండటానికి ఇల్లు, ఇంటి స్థలం మరియు రేషన్ కార్డు కూడా లేకపోవడం పట్ల సంస్థ ప్రతినిధులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో దాతల సహకారంతో సమకూర్చిన రూ. 22,000 ఆర్థిక సాయంతో పాటు 50 కిలోల బియ్యాన్ని మృతుని కుటుంబ సభ్యులకు సంస్థ బాధ్యులు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వివేకానంద సేవా సంస్థ అధ్యక్షుడు ఆడేపు రమేష్ మాట్లాడుతూ... శంకర్ కుటుంబాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వారికి వెంటనే ఉచితంగా రేషన్ కార్డు మంజూరు చేసి, ఇంటి స్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మించి ఇచ్చి అన్ని విధాలా అండగా నిలవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆపదలో ఉన్న పేద కుటుంబానికి సహాయం అందించేందుకు ముందుకు వచ్చిన దాతలందరికీ ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివేకానంద సేవా సంస్థ ప్రతినిధులు బిల్లా రమేష్, రాధారపు శివకుమార్, లెంకలపల్లి స్వామి, బొట్టు శ్రీనివాస్, కుసూరి యాదగిరి, బండి కుమారస్వామి, లెక్కలపల్లి శ్రీనివాస్, రాధారపు కృష్ణమూర్తి, మల్లికార్జున్, బేల పూర్ణ చందర్, లక్కర్స్ పూర్ణచందర్, వనపర్తి రమేష్, ఇప్ప శ్రీనివాస్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్ రైతుబజార్‌ను తొలగిస్తే

1,500 కుటుంబాల జీవనోపాధి దెబ్బతింటుంది

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం
- ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో తొలగింపు భయాలు..
- ప్రత్యామ్నాయ స్థలం చూపాలని విజ్ఞప్తి
- 26 ఏళ్లుగా వేలాది మంది రైతులకు, వినియోగదారులకు సేవలందిస్తున్న రైతుబజార్



మేడ్చల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా అల్వాల్ రైతుబజార్‌ను తొలగిస్తే దానిపై ఆధారపడిన సుమారు 1,500 రైతు కుటుంబాల జీవనోపాధి పూర్తిగా దెబ్బతింటుందని రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు తమ సమస్యను పరిష్కరించి, జీవనోపాధిని కాపాడాలని కోరుతూ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... మేడ్చల్, సిద్దిపేట, మెదక్, నల్గొండ జిల్లాల్లోని వివిధ గ్రామాల నుంచి ప్రతిరోజూ సుమారు 1,000 నుండి 1,500 మంది రైతులు తాజా కూరగాయలను అమ్మకానికి ఇక్కడికి తీసుకొస్తుంటారని తెలిపారు. 1999 జనవరి 26న ప్రారంభమైన ఈ రైతుబజార్ గత 26 ఏళ్లుగా రైతులకు ప్రధాన జీవనాధారంగా కొనసాగుతోందని వివరించారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులు నేరుగా వినియోగదారులకు తక్కువ ధరలకే కూరగాయలు విక్రయించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. వంతెన నిర్మాణ నిమిత్తం రైతుబజార్‌ను తొలగించక తప్పని పరిస్థితి ఉంటే, అల్వాల్ పరిసర ప్రాంతాల్లోనే వెంటనే ప్రత్యామ్నాయ స్థలాన్ని కేటాయించి తమను ఆదుకోవాలని ఎంపీ ఈటల రాజేందర్‌ను కోరారు.



5వ డివిజన్ లో ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు

హన్మకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ సూచనల మేరకు 5వ డివిజన్ పరిధిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. 5వ డివిజన్ అధ్యక్షుడు పున్నం చందర్ ఆధ్వర్యంలో, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుసుమ లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై స్థానిక సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో అర్హులైన పట్టభద్రుల నుంచి ఎమ్మెల్సీ ఓటరు నమోదు ఫారాలను సేకరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... అర్హులైన ప్రతి పట్టభద్రుడినీ ఓటరుగా నమోదు చేయించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ పండగ సాగర్, దాసరి సమ్మన్న, కానుగంటి అరవింద్, మహమ్మద్ ఇస్మాయిల్, తాడిశెట్టి మహేష్, మూల ప్రభాకర్, సోషల్ మీడియా ప్రతినిధులు విశాల్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



పట్టభద్రుల సమస్యలపై చట్టసభల్లో గొంతు విప్పేది కాంగ్రెసే



శాయంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ : గ్రాడ్యుయేట్ల ఉజ్వల భవిష్యత్తు కోసం రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ శాయంపేట మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. వరంగల్ – ఖమ్మం – నల్గొండ గ్రాడ్యుయేట్ ఎన్నికల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తం రెడ్డికి మద్దతుగా మండలంలోని మందారిపేట గ్రామంలో బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ పట్టభద్రులను కలిసి అభ్యర్థి వివరాలను, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం బుచ్చిరెడ్డి మాట్లాడుతూ... పట్టభద్రుల సమస్యలు, వారి ఆకాంక్షలను చట్టసభల్లో సమర్థవంతంగా ప్రస్తావించి పరిష్కరించే సామర్థ్యం సర్వోత్తం రెడ్డికి ఉందన్నారు. ఇప్పటివరకు ఓటరుగా నమోదు చేసుకోని అర్హులైన ప్రతి పట్టభద్రుడూ వెంటనే తమ పేరును నమోదు చేసుకోవాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మారపెల్లి రవీందర్, చిందం రవి, నిమ్మల రమేష్, కుక్కల తిరుపతి, రావుల శ్రీనివాస్, కొమ్ముల భాస్కర్, పైడి, తక్కల్ల సాంబయ్య, కొమ్ముల విష్ణు, బడుగు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగత్వం శరీరానికే కానీ ప్రతిభకు కాదు

కేయూ ఈసీ మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి



రాంపూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : దివ్యాంగులకు సేవ చేయడం విశ్వమానవ సేవతో సమానమని అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. హన్మకొండ జిల్లా రాంపూర్ లోని జీవధార ఆవరణలో ఫాదర్ జెరోమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "మానవీ – దివ్యాంగులకు ఆత్మీయ స్పర్శ, సాంస్కృతిక సమ్మేళనం" కార్యక్రమానికి ఆమె విశిష్ట ఆత్మీయ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ... దివ్యాంగులైన పిల్లలు ప్రదర్శించిన నృత్యాలు, అలరించిన పాటలు అందరినీ ఆకట్టుకున్నాయని తెలిపారు. దివ్యాంగత్వం శరీరానికే తప్ప ప్రతిభకు కాదని ఈ పిల్లలు తమ ప్రతిభాపాటవాలతో నిరూపించారని కొనియాడారు. జిల్లాలోని దివ్యాంగ ఆశ్రమాలన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, ఐక్యతను చాటుతూ పిల్లలకు ఆత్మీయ స్పర్శ, చేయూత అందించిన ఫాదర్ జెరోమ్ సేవలు సమాజానికి ఎంతో ఆదర్శప్రాయమని, స్ఫూర్తిదాయకమని శ్లాఘించారు. మానసిక దివ్యాంగులకు ప్రేమ, ఆత్మీయతలే నిజమైన ఔషధాలని డాక్టర్ అనితా రెడ్డి పేర్కొన్నారు. వారి హక్కులను కాపాడుతూ సమాజంలో అక్కున చేర్చుకున్నప్పుడే అసలైన సేవ చేసినట్లవుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ తమకు తోచిన సహాయ సహకారాలను దివ్యాంగులకు అందించాలని, సాధారణ వ్యక్తులతో సమానంగా వారిని గౌరవిస్తూ ప్రేమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు, ఫాదర్స్, సిస్టర్స్, పిల్లల తల్లిదండ్రులు, నిర్వాహకులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కేపీ హెచ్‌బీలో 'మెగా ముకుంద జ్యువెలరీ'

14వ షోరూమ్ ఘన ప్రారంభం

- ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు
- తరుగు కేవలం 6.99%, ఎటువంటి తయారీ ఛార్జీలు లేవు: డైరెక్టర్లు
- ఈ నెల 4 నుంచి 15 వరకు ప్రత్యేక ప్రారంభోత్సవ ఆఫర్లు

హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : తెలుగు రాష్ట్రాల్లో ఫ్యాక్టరీ అవుట్‌లెట్ కాన్సెప్ట్‌తో విశేష ప్రజాదరణ పొందిన 'ముకుంద జ్యువెలరీ' తన 14వ నూతన షోరూమ్‌ను 'మెగా ముకుంద జ్యువెలరీ' పేరుతో కేపీహెచ్‌బీలోని PNR ఎంపైర్ మొదటి అంతస్తులో అత్యంత వైభవంగా ప్రారంభించింది. ముకుంద జ్యువెలరీ ఛైర్మన్ బొత్తి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఘన ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కేపీహెచ్‌బీ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఈరని కిరణ్ రెడ్డి తదితర ప్రముఖులు హాజరై నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

- వినియోగదారులకు ప్రత్యేక తగ్గింపు ఆఫర్లు

షోరూమ్ ప్రారంభోత్సవం సందర్భంగా ముకుంద జ్యువెలరీ డైరెక్టర్లు డాక్టర్ నికితా రెడ్డి, దాచేపల్లి కృష్ణ మాట్లాడుతూ... తమ 14వ బ్రాంచ్ ప్రారంభ సందర్భాన్ని పురస్కరించుకుని ఆభరణాల కొనుగోలుపై తరుగు కేవలం 6.99% మాత్రమే వసూలు చేస్తున్నామని, అలాగే ఎలాంటి తయారీ ఛార్జీలు లేవని వెల్లడించారు. ఈ అద్భుతమైన ఆఫర్ ఈ నెల 4 నుంచి 15 వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని, పసిడి ప్రియులు, వినియోగదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. తెలుగు రాష్ట్రాలతో పాటు బెంగళూరులోనూ విజయవంతంగా రన్ అవుతున్న ముకుంద జ్యువెలరీకి ఇప్పటికే కూకట్‌పల్లి, ఖమ్మం, కొత్తపేట, సోమాజిగూడ, హన్మకొండ, సుచిత్ర, చందానగర్, జూబ్లీహిల్స్, విశాఖపట్నం, విజయవాడ, రాజమండ్రి, బెంగళూరు, కేపీహెచ్‌బీలోని 'ఫూర్వి గోల్డ్ అండ్ డైమండ్స్' రూపంలో 13 శాఖలు సేవలు అందిస్తున్నాయని, త్వరలోనే భీమవరంలోనూ నూతన బ్రాంచ్‌ను ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

- గంగారం, కొత్తగూడెం మండలాల పట్టభద్రుల ఓటరు నమోదుపై సమీక్ష
- హాజరైన మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, రాకేష్ రెడ్డి



ములుగు, వాయిస్ ఆఫ్ వందే భారత్ : రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ములుగు నియోజకవర్గ పరిధిలోని అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించే బాధ్యతను నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు. ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు అధ్యక్షతన గంగారం, కొత్తగూడెం మండలాల పట్టభద్రుల ఓటరు నమోదు రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డితో కలిసి నాయకుడు రాకేష్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయానికి ఓటరు నమోదు అత్యంత కీలకమైన ఘట్టమని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామ స్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్‌నూ ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. ప్రజల్లో, విద్యావంతుల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ఈ ఎన్నికల్లో ప్రతిబింబించేలా కార్యకర్తలు అప్రమత్తంగా ఉంటూ ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ తొలి సమావేశంలో పాల్గొన్న తోట లహరి

- హాజరైన జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్, జిల్లా ఎస్పీ మహేష్ గీతే
- కమిటీ నూతన సభ్యులకు కలెక్టర్ సన్మానం



సిరిసిల్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్ : జిల్లా కలెక్టర్ గరీమ అగర్వాల్, జిల్లా ఎస్పీ బాబాసాహెబ్ మహేష్ గీతేల అధ్యక్షతన నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ తొలి సమావేశంలో కమిటీ నూతన సభ్యురాలు తోట లహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యురాలిగా నియమితులైన తోట లహరితో పాటు ఇతర సభ్యులను కలెక్టర్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ, డీఎస్పీలను తోట లహరి శాలువాలతో సత్కరించి తమ గౌరవాభిమానాలను చాటుకున్నారు. ఈ సందర్భంగా తోట లహరి మాట్లాడుతూ... సమాజంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కుల పరిరక్షణకు, బాధితులకు న్యాయం జరిగేలా చూడటానికి ఈ కమిటీ ద్వారా లభించిన బాధ్యతను పూర్తి నిబద్ధతతో నిర్వహిస్తానని తెలిపారు. బాధ్యతాయుతమైన ఈ పదవిలో సేవలు అందించే అవకాశం కల్పించిన అధికారులకు ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

వేములవాడలో పటాకుల దుకాణం ప్రారంభం

- ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'విజయలక్ష్మి ఫైర్ వర్క్స్' పటాకుల దుకాణాన్ని రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా దుకాణాన్ని పరిశీలించిన ఆది శ్రీనివాస్.. నిర్వాహకులకు తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యాపార రంగంలో క్రమక్రమంగా అభివృద్ధి సాధిస్తూ, వినియోగదారులకు సురక్షితమైన, నాణ్యమైన ఉత్పత్తులతో మెరుగైన సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు. స్థానిక నాయకులు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక దృష్టి సారించాలి

- సర్పంచ్ కట్కూరి రాధిక
- గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు



గణపురం, వాయిస్ ఆఫ్ వందే భారత్ : పిల్లల ఆరోగ్యం, సరైన పోషణపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ అన్నారు. బుధవారం గణపురం మండల కేంద్రంలోని బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం చిన్నారులకు గుడ్లు, పాలు, బాలామృతం వంటి పౌష్టికాహారాన్ని అందిస్తూనే, ప్రాథమిక విద్య, క్రమం తప్పకుండా టీకాలు వేయించడంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తోందన్నారు. గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శ్రావణి, చిన్నారులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.